శ్మశానవాటికలు కనుమరుగు

- నారాయణ, తిరుమల విద్యాసంస్థల వాడుకనీటితో నిండిన చెరువు
- తాళ్లవలస పంచాయతీ వాసులకు ఇబ్బందులు



బంగారమ్మ ఆలయ గట్టుపై మృతదేహాలను దహనం చేసిన ఆనవాళ్లు



రసాయన మురుగు వ్యర్థాలతో నిండిపోయిన తాళ్లవలస పెద్ద చెరువు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలోని పెద్ద చెరువు నిండిపోవడంతో ఈ చెరువు గర్భంలోని శ్మశానవాటికలు నీటమునిగి కనుమరుగైపోయాయి. దీంతో ఇటీవల చనిపోయిన వారి కుటుంబ సభ్యుల మృతదేహాలను గ్రామదేవత బంగారమ్మ ఆలయం గట్టుపై దహనం చేసుకోవాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడ్చవలసిన మృతదేహాలకు ఇక్కడ కనీసం ఆరు అడుగుల స్థలం కూడా లేకుండాపోయిందని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు లేకపోయినా పంచాయతీ పరిధిలో ఉన్న నారాయణ, తిరుమల విద్యా సంస్థల నుంచి మురుగునీటి వ్యర్థాలు పెద్ద ఎత్తున చెరువు నిండుగా పేరుకుపోయాయి. ఈ వ్యర్థాలను శుభ్రం చేయకుండా నేరుగా చెరువులోకి వదిలేయడంతో సమీపంలో ఉన్న రాజుల తాళ్లవలస, ఎరుసుపేట, ఎస్సీ కాలనీ, బంగారమ్మ కాలనీలను దుర్వాసన సమస్య వేధిస్తోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువు దుర్వాసన కారణంగా రాకపోకలు సాగించేవారు సైతం ముక్కు మూసుకోకుండా ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీలో ఎస్సీ కాలనీ, ఎరుసుపేట, పెద్ద ఊరు, బంగారమ్మ కాలనీలకు చెందిన సుమారు 500 కుటుంబాల వారికి శ్మశానవాటిక ఈ చెరువు గర్భంలోనే ఉంది.

శుభ్రం చేసి అవుట్‌లెట్లు తెరిస్తేనే...

చెరువులో శ్మశానవాటికలు, వాటి వద్ద ఏర్పాటు చేసిన బోరుబావులు మునిగిపోవడంతో అత్యవసరంగా అవుట్‌లెట్లు తెరిచి ఎక్కువగా ఉన్న నీటిని బయటకు వదలాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. చెరువు కింద పెద్దిపాలెం, చిట్టీల అగ్రహారం, రామునేనిపేట, తాళ్లవలస, ఎరుసుపేట గ్రామస్తులు తోట పంటలు, కూరగాయలు, పువ్వులు, వరి వంటివి సాగు చేస్తున్నారు. తరచూ చెరువు ఎండిపోతుండటంతో వీరిలో ఎక్కువ శాతం వ్యవసాయ మోటార్లపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. దీంతో చెరువునీరు వినియోగించే వారి శాతంగా తక్కువగా ఉంది. అలాగే చెరువు కింద గెడ్డలను చాలా వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మూసేయడంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో నీరు నిల్వ ఉండిపోయి తెట్టులా తేలి ప్రమాదకరమైన దుర్వాసన వస్తోందని స్థానికులు అంటున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్మశానవాటికల్లో మట్టి కోసం తీసిన గోతులు కూడా మురుగుతో నిండిపోయాయని పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది దృష్టికి కూడా తీసుకెళ్లారు. చెరువు ముంపు సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ వద్ద ప్రస్తావించగా నారాయణ, తిరుమల విద్యాసంస్థల యాజమాన్యాలు మురుగునీటిని శుద్ధి చేసి చెరువులోకి వదలాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆ యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి అవుట్‌లెట్లు తెరిచి చెరువును శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు.

మత్స్యకారులకు పింఛన్ల పంపిణీ



ఫిషింగ్ హార్బర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న పెదనాగమయ్యపాలెం వలంటీర్లు



మంచంపై ఉన్న గరికిన నరసమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బడే సతీష్‌కుమార్

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీకి చెందిన మత్స్యకారులు ఉపాధి పనుల నిమిత్తం తరచూ విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌కు వెళ్తుంటారు. వీరి వెంట తల్లిదండ్రులు, పిల్లలు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొత్తగా మంజూరైన పింఛన్లతోపాటు పెరిగిన రూ.250 కలిపి రూ.2750 వంతున పెదనాగమయ్యపాలెం వలంటీర్లు 40 కిలోమీటర్లు దూరంలోని ఫిషింగ్ హార్బర్‌కు ఆదివారం వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. పింఛన్ నగదు పెరగడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు.

గొల్లల తాళ్లవలసలో ఇరువర్గాల మధ్య వివాదం



ఒక వర్గం నిర్మించిన షెడ్డును మరొక వర్గం కూల్చిన దృశ్యం

తగరపువలస: న్యాయస్థానంలో వివాదంలో ఉన్న స్థలానికి సంబంధించి భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు ఇరువర్గాలను న్యాయస్థానంలో తేల్చుకోవాలని పంపించి వేశారు. వివరాల్లోకి వెళ్తే... ఇక్కడి సర్వే నంబర్ 199/2లో 4.13 ఎకరాలు తమ పూర్వీకుల నుంచి వచ్చిందంటూ అక్కరమాని తోటయ్య కుటుంబీకులు ప్రహరీ నిర్మించి షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కానీ నగరానికి చెందిన మరొకవర్గం తరఫున మనుషులు పెద్ద ఎత్తున చేరుకుని షెడ్డును కూల్చి... ఉన్న ప్రహరీకి అదనంగా నిర్మాణాలు చేపట్టదలచారు. ఈ నేపథ్యంలో తోటయ్య వారసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం ముదిరింది. కొట్లాటకు దారితీసే పరిస్థితుల్లో పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా తోటయ్య వారసులలో అప్పలనాయుడు అనే వ్యక్తి మాట్లాడుతూ నగరానికి చెందిన కొందరు వ్యక్తులు 209 సర్వే నంబరు గల లింక్ డాక్యుమెంట్‌తో కొనుక్కుని తమ స్థలంలో ప్రవేశిస్తున్నారని ఆరోపించారు. భీమిలి పోలీసులు తమకు రక్షణ కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి 'ఫ్రెండ్స్' సాయం



భవిరిశెట్టి గారికి రూ.5వేలు అందిస్తున్న ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస – కొత్తపేటకు చెందిన భవిరిశెట్టి గౌరికి ఆదివారం ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.5వేల సాయం అందించారు. రజక వృత్తి చేసుకునే ఆమె భర్త రాంబాబు ఇటీవల జీవీఎంసీ చెత్త తరలించే వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. దీనిపై పలువురు దాతలు స్పందిస్తున్న నేపథ్యంలో ఫ్రెండ్స్ ప్రతినిధులు ముందుకొచ్చారు. భవిష్యత్‌లో రాంబాబు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న పాములు



చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని తగరపువలస గొల్లవీధి

తగరపువలస: చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న తగరపువలస తాతా థియేటర్ గొల్లవీధిని పాముల బెడద పట్టి పీడిస్తోంది. ఆస్పత్రి ఆవరణలో విపరీతంగా పెరిగిన తుప్పలు, చెట్ల కారణంగా పాములు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. చాలాసార్లు ఆవరణలో ఈఎస్ఐ ఆస్పత్రితోపాటు పక్కనే ఉన్న కార్మిక రాజ్య బీమా కార్యాలయం సిబ్బందికి, అక్కడకు వచ్చే కార్మికులకు తరచూ పాములు ఎదురవుతున్నాయి. ప్రహరీని ఆనుకుని ఉన్న చెట్ల మీద నుంచి తగరపువలస గొల్లవీధి, జోగావారి వీధిలోకి ప్రవేశించి ఇళ్లలోకి చేరుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి నియంత్రణకు ఆస్పత్రి ప్రహరీ లోపల గోడను ఆనుకుని ఉన్న చెట్లు, తుప్పలను తొలగించి రక్షణ కల్పించాలని గొల్లవీధి, జోగావారి వీధి వాసులు కోరుతున్నారు.

లక్ష్మీపురం సర్పంచ్ రామారావు మృతి



లచ్చుబుగత రామారావు (ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ లచ్చుబుగత రామారావు (67) అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆరు మాసాలుగా అస్వస్థత కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం విషమంగా ఉండడంతో ఆదివారమే డిశ్చార్జి చేశారు. గతంలో మజ్జివలస పీఏసీఎస్ అధ్యక్షునిగా పనిచేశారు. రైతు కుటుంబానికి చెందిన రామారావుకు భార్య సూరమ్మతోపాటు పెళ్లయిన ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు



జెడ్సీ రాము దంపతులను సన్మానిస్తున్న సీఐ రామకృష్ణ, జీవీఎంసీ అధికారులు

పీఎం పాలెం : అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్ల గత మూడేళ్లలో మధురవాడ జోన్ పరిధిలో మంచి ఫలితాలు సాధించామని జెడ్సీ బొడ్డేపల్లి రాము అన్నారు. మధురవాడ జోన్ – 2 కమిషనర్‌గా పనిచేస్తూ భీమిలి జోన్‌కు బదిలీ అయిన బొడ్డేపల్లి రాము దంపతులను జోనల్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు స్థానిక వైజాగ్ కన్వెన్షన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. అలాగే కొత్త జెడ్సీగా బాధ్యతలు చేపట్టిన కొట్యాడ కనక మహాలక్ష్మికి ఆహ్వానం పలుకుతూ సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్సీ రాము మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు సమర్థంగా సేవలు అందించామన్నారు. నగర పాలక సంస్థలో పని చేసే వారు సమయపాలనకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జెడ్సీ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో, స్థానిక సమస్యల పరిష్కారంలో జీవీఎంసీ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. సమావేశంలో స్థానిక సీఐ వై.రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ పి.రమేష్, ఈఈ మత్స్యరాజు, డీఈలు శ్రీహరి, వంశీ, భరణికుమార్, ఎస్ఎస్ రాజు, సూపరింటెండెంట్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ, కల్లివానిపాలెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ని వైఎస్సార్ సీపీ నాయకుడు బొట్టా రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. 48 జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే వారికి వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వానపల్లి ముత్యాలరావు, బోయి వెంకట రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పాడ సూరిబాబు, ఉప సర్పంచ్ బొట్టా శ్రీను, ఉప్పాడ రామిరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, గుడ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

శిథిల రోడ్డుతో అవస్థలు



రెడ్డిపల్లి శాంతినికేతన్ వద్ద శిథిలమైన రోడ్డు

పద్మనాభం: విజయనగరం – కొంత్యాం మార్గంలో రెడ్డిపల్లి శాంతినికేతన్ సమీపంలో రోడ్డు శిథిలమైంది. దీంతో ప్రయాణికులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు నిరంతరం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. శాంతినికేతన్ సమీపంలో రోడ్డు గోతులు పడి అధ్వానంగా మారడంతో బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మూలకు చేరిన ఆకట్టుకునే బొమ్మలు



కళావిహీనంగా మారిన బొమ్మలు...



కళావిహీనంగా ఛత్రపతి శివాజీ ప్రతిమ

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో ఒకప్పుడు ఎంతో ఆకర్షణీయంగా ఉన్న బొమ్మలు ఇప్పుడు కళావిహీనమై మూలకు చేరిపోయాయి. 2002లో అప్పటి మున్సిపల్ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి ఇక్కడి బీచ్ పార్కు, బీచ్‌రోడ్డుతోపాటు పరిసరాల్లో ఎంతో ఆకర్షణగా ఉండే బొమ్మలను ఏర్పాటు చేయించారు. అవి ఎంతో సహజంగా ఉండడంతో చూడడానికి సందర్శకులు పెద్ద ఎత్తున వచ్చేవారు. వీటిల్లో ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రధాన ఆకర్షణగా ఉండేది. దీని వద్ద చాలా మంది ఫొటోలు తీసుకునేవారు. కాలక్రమంలో అవి దెబ్బతిని పాడయ్యాయి. వాటికి చిన్నపాటి మరమ్మతులు చేయించి రంగులు వేయించాల్సి ఉండగా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. అలాగే వీటిని బీచ్ ఎదురుగా ఉన్న పావురాల పార్కు ఆవరణలో పడేయడంతో మరింత పాడైపోతున్నాయి. ఇటీవల కొన్ని కొత్త బొమ్మలను తయారు చేయించి అధికారులు బీచ్‌లో ఏర్పాటు చేశారు. అప్పుడే వీటికి మరమ్మతులు చేయిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా ఆ బొమ్మలకు మరమ్మతులు చేపట్టించి బీచ్ పరిసరాల్లో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డున పడిన పేద కుటుంబం



తల్లి కొండమ్మ, భార్య యమునతో ఇటీవల ప్రమాదంలో కాలు, పాదం కోల్పోయిన రమణ



రూ.55 వేలు నగదు అందిస్తున్న టీఎస్‌పీ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

- లారీ ప్రమాదంతో మంచానికే పరిమితమైన ఇంటి పెద్ద
- వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ కోసం ఆర్థిక ఇబ్బందులు

తగరపువలస: ఓ పేద కుటుంబానికి లారీ ప్రమాదం రూపంలో విధి విషమ పరీక్ష పెట్టింది. భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన కుప్ప రమణ(28) గత ఏడాది డిసెంబర్ 23న శ్రీకాకుళం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు, ఎడమ పాదాన్ని కోల్పోయాడు. లారీ డ్రైవర్‌గా కుటుంబానికి అండగా ఉన్న రమణ ఈ ప్రమాదం కారణంగా రోడ్డున పడాల్సి వచ్చింది. రెండేళ్ల క్రితం యమునతో వివాహమైన రమణ కష్టార్జితంపై నాలుగు నెలల పాప అన్వితతోపాటు గీత కార్మికులైన అమ్మానాన్న అప్పారావు, కొండమ్మ ఆధారపడి ఉన్నారు. లారీతో బతుకు బండిని నడిపించిన రమణ ప్రస్తుతం కదలలేక మంచానికే పరిమితమయ్యాడు.

టీఎస్‌పీ హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

రమణ వైద్యానికి సహకరించిన పంచాయతీ పెద్దలు అతని కుటుంబానికి దారి చూపడానికి ఆలోచన చేస్తున్నారు. ఈలోగా పంచాయతీకి చెందిన టీఎస్‌పీ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు వాండ్రాసి సతీష్‌కుమార్, బాయిన మంగరాజు, పూసర్ల రామారావు, పొట్నూరు కొండబాబు, తమ్మిన రమేష్, ఇద్దిపల్లి రవి, పల్లా రామకృష్ణ, రాజగిరి రవికుమార్ తదితరులు చందాల ద్వారా సేకరించిన రూ.55వేల నగదు, నిత్యావసర సరుకులు ఆదివారం అందించారు. అంతేకాకుండా జైపూర్ కృత్రిమ కాలు అమర్చేందుకు, కుటుంబానికి ఉపాధి మార్గాన్ని చూపేందుకు ఆలోచన చేస్తున్నారు.

దాతలు అండగా నిలవాలని వేడుకోలు

నాలుగు నెలల కుమార్తె, భార్య, వృద్ధులైన తల్లిదండ్రులను పోషించుకోవడానికి, మరోవైపు వైద్యానికి ఇబ్బంది పడుతున్న రమణ కుటుంబానికి దాతలు అండగా నిలవాలని టీఎస్‌పీ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు కోరుతున్నారు. ఆ కుటుంబానికి సాయం అందించదలచిన వారు కుప్ప రమణ ఫోన్ పే నంబరు 90308 32480 లేదా తగరపువలసలోని కరూర్ వైశ్యా బ్యాంకులోని అతని ఖాతా నంబర్ 4908155000002857(ఐఎఫ్ఎస్‌సీ కోడ్: KVBL0004908) ద్వారా సాయం అందించాలని కోరుతున్నారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో టోకరా

- మిథిలాపురి వుడా కాలనీలో రూ.20 వేలు వసూలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో భవనంపై అదనపు స్లాబు వేయాలని భావిస్తున్న ఇంటి యజమాని నుంచి ఓ వ్యక్తి జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో రూ.20 వేలు వసూలు చేసి పరారయ్యాడు. దీనికి సంబంధించి బాధితుడు, మిథిలాపురి వుడా లే అవుట్స్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రిమూర్తులు రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో ఉన్న అపోలో డయాగ్నోస్టిక్స్ భవనంపై అదనపు స్లాబు వేయించాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకుని ఓ వ్యక్తి ఆయన దగ్గరకి వచ్చి తాను కొత్త బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను అని, తన పేరు దాట్ల శ్రీనివాసరాజు అని చెప్పి నమ్మించాడు. అన్నీ చూసుకుంటానని, ఫిబ్రవరి 5 నుంచి పనులు కూడా చేసుకోమని, పైగా భవన యజమానికి చెందిన బంధువులు, మిత్రుల పేర్లు ఒకటీ రెండు చెప్పడంతో నిజమేనని నమ్మారు. రూ.30 వేలు ఇస్తే అనుమతి ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ముందుగా రూ.20 వేలు ఇచ్చారు. నగదు ఇచ్చిన తర్వాత సచివాలయ సిబ్బందిని వాకబు చేయడంతో అటువంటి పేరు గల వారు ఎవ్వరూ జీవీఎంసీలో లేరని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు ఇస్తానని త్రిమూర్తులురాజు చెప్పారు.

సింహగిరిపై వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతాన్ని సమర్పిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలకు పుష్పాలంకరణ చేసి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు పూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో నరసింహరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా జరిపారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

మార్కెట్ మూసివేతపై వ్యాపారుల ఆందోళన

కంచరపాలెం: దశాబ్దాల కాలంగా ఇక్కడే కూరగాయలు, చేపలు అమ్ముకుంటున్న తమపై గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నాయకులు కక్ష కట్టి మార్కెట్‌ను ఖాళీ చేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమని వ్యాపారులు ఆదివారం ఆందోళనకు దిగారు. శనివారం అర్ధరాత్రి మార్కెట్‌కు తాళాలు వేసి వ్యాపారాలు జరగకుండా ఇసుక, మట్టి రహదారికి అడ్డంగా వేయడంతో చిరు వ్యాపారులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మీడియాతో వారు మాట్లాడుతూ ఏ సంబంధం లేని గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు 70 ఏళ్లుగా అద్దెలు, కరెంటు బిల్లుల రూపంలో అశీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కంచరపాలెం మెట్టుపై స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, వ్యాపారులను అశీల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించి తమనే తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్డీవో, కలెక్టర్‌లను ఆశ్రయించామని చెప్పారు. కోర్టులో స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు ఆపకుండా వ్యాపారాలను అడ్డుకుని తమ పొట్ట కొట్టడం అన్యాయమని వాపోయారు. ఆదివారం మార్కెట్ నిలిచిపోవడంతో ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న 142 దుకాణాల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మార్కెట్‌కు తాళాలు వేయడంతో కూరగాయలు, చేపలు నష్టపోయామన్నారు. తమ స్థలంలో వ్యాపారాలు చేయనివ్వకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రహదారిపై ఆదివారం బైఠాయించి ధర్నా చేస్తున్న వ్యాపారులతో డీసీపీ–2 ఆనందరెడ్డి, ఏసీపీ నరసింహమూర్తి, సీఐ విజయకుమార్ మాట్లాడారు. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.